పల్లె దవాఖానలో కేంద్ర బృందం

పల్లె దవాఖానాను పరిశీలిస్తున్న కేంద్ర బృందం

బూర్గంపహాడ్, డిసెంబర్ 16: మోరంపల్లిబంజర్ పీహెచ్‌సీ పరిధిలోని నాగినేనిప్రోలు రెడ్డిపాలెం పల్లె దవాఖానను ఎన్‌క్యూఏఎస్ సెంట్రల్ టీమ్ శనివారం సందర్శించింది. ఈ టీమ్‌లో శర్మ, రంజిత్ బారువా ఉన్నారు. రికార్డులను పరిశీలించారు. బీపీ, షుగర్ బాధితులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. జిల్లా ఎన్‌క్యూఏఎస్ టీమ్ సభ్యులు డాక్టర్ పి.స్పందన, మేనేజర్ శృతి, డీపీఎం దుర్గ, పీహెచ్‌సీ డాక్టర్ లక్ష్మీసాహితి పాల్గొన్నారు.

యాసంగి సాగు ప్రారంభం

వరి నాట్లు వేస్తున్న కూలీలు

కరకగూడెం, డిసెంబర్ 16: మండలవ్యాప్తంగా యాసంగి వరి నాట్లు ప్రారంభమయ్యాయి. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురవడంతో చెరువులు, కుంటలు నిండాయి. విద్యుత్ ఇబ్బంది లేదు. దీంతో, సాగు పనులు జోరుగా సాగుతున్నాయి. రైతు కూలీలకు చేతి నిండా పని దొరుకుతున్నది. మండల వ్యాప్తంగా 3,500 ఎకరాల్లో వరి, 1700 ఎకరాల్లో మిర్చి, 600 ఎకరాల్లో బొబ్బెర్లు, అక్కడక్కడ కంది, మినుము సాగు చేస్తున్నట్లు వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

సింగరేణిలో జోరుగా ప్రచారం

గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న వెలగపల్లి జాన్

మణుగూరు టౌన్, డిసెంబర్ 16: సింగరేణిలో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతున్నది. ఐఎన్‌టీయూసీనే గెలిపించాలంటూ మణుగూరు ఏరియా వైస్ ప్రెసిడెంట్ వెలగపల్లి జాన్ శనివారం కొండాపురం అండర్ గ్రౌండ్ గని వద్ద గేట్ మీటింగ్ నిర్వహించారు. నాయకులు టి.శ్రీనివాస్, టి.పెదనాగయ్య, రాంశెట్టి, కృష్ణచేతన్, భాగం రవి, శివ, తెప్పా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీని గెలిపించాలని..

గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న వాసిరెడ్డి సీతారామయ్య

మణుగూరు టౌన్, డిసెంబర్ 16: ఏఐటీయూసీని గెలిపించాలంటూ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య శనివారం ప్రచారం నిర్వహించారు. పీకే ఓసీ-2, మణుగూరు ఓసీ, కేసీహెచ్‌పీ గనుల వద్ద గేట్ మీటింగుల్లో మాట్లాడారు. నాయకులు మిరియాల రంగయ్య, కొమిరి రాజ్‌కుమార్, వై.రాంగోపాల్, మల్లెల రామనర్సయ్య, మేకల ఈశ్వర్, జి.పుల్లారావు పాల్గొన్నారు.

23 నుంచి బాలికల క్రికెట్ పోటీలు

కొత్తగూడెం టౌన్, డిసెంబర్ 16 : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 23 నుంచి 26వ తేదీ వరకు 67వ రాష్ట్రస్థాయి అండర్-17 బాలికల క్రికెట్ పోటీలను నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ చైర్మన్, జిల్లా విద్యాధికారి ఎం.వెంకటేశ్వరచారి తెలిపారు. 67వ రాష్ట్రస్థాయి పాఠశాలల అండర్-17 వయస్సు ఉన్న బాలికల క్రికెట్ పోటీలను అశ్వాపురంలోని గౌతమీనగర్‌లో ఉన్న భారజల కర్మాగారం క్రికెట్ మైదానంలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

తూము నృసింహదాసు జయంత్యుత్సవం

నృసింహదాసు చిత్రపటంతో గిరి ప్రదక్షిణ చేస్తున్న వారసులు, ఈవో

భద్రాచలం, డిసెంబర్ 16: భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానంలో శనివారం రాజా తూము లక్ష్మీనృసింహదాసు 233వ జయంత్యుత్సవం ఘనంగా జరిగింది. నృసింహదాసు చిత్రపటానికి అంతరాలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వారసులతో కలిసి దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి, అర్చకులు, ఆలయ అధికారులు, సిబ్బంది కలిసి గిరి ప్రదక్షిణ చేశారు. విస్తా కాంప్లెక్స్ వద్దనున్న నృసింహదాసు విగ్రహానికి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం, నృసింహదాసు కీర్తనల ఆలాపన, కోలాట నృత్యం నడుమ తాత గుడి సెంటర్ వద్ద ఉన్న గోవిందరాజ స్వామి ఆలయానికి వెళ్లి రామాలయానికి తిరిగొచ్చారు.

నృసింహదాసు ఎవరంటే...

భద్రాద్రి రామాలయాన్ని భక్త రామదాసు నిర్మించారు. ఈ 'నేరానికి'గాను ఆయనను నైజాం సంస్థానం ప్రభువు తానీషా.. గోల్కొండలోని బందిఖానాలో ఖైదు చేశారు. అప్పటికి ఇంకా రామాలయ నిర్మాణం పూర్తి కాలేదు. భక్త రామదాసు తరువాత రామయ్యను అంతే భక్తితో కొలిచిన భక్తాగ్రేసురుడు నృసింహదాసు. భక్త రామదాసు ఖైదుతో అసంపూర్తిగా రామాలయం నిర్మాణ పనులను తూము నృసింహదాసు పూర్తి చేయించారు. రామయ్య మీద భక్తితో కీర్తనలను ఆలపించారు. ఆలయంలో తెల్లవారుజామున దశవిధ ఉత్సవాలను ఈయనే ఏర్పాటు చేశారు. తెల్లవారుజామున ప్రభోధోత్సవం, దంత ధావనోత్సవం, స్నపనోత్సవం, కృత కర్మ ఫలోత్సవం, బాల లీలామహోత్సవం, మధ్యాహ్నం ప్రకాశోత్సవం, సాయంత్రం ప్రభుత్వోత్సవం (దర్బార్ సేవ), మహారాజ సేవోత్సవం, పర్యంకోత్సవం, నిత్యోత్సవం.. ఇవన్నీ నృసింహదాసు ఏర్పాటు చేసినవే. ఇవి ఇప్పటికీ కొనసాగుతున్నాయి.

ఆలయాల పునఃప్రతిష్ఠ

గుండాల, డిసెంబర్ 16: మండలంలోని కాచనపల్లి గ్రామంలో వేంకటేశ్వరస్వామి, ఆంజనేయ స్వామి ఆలయాలను వేద పండితులు శనివారం పునఃప్రతిష్ఠించారు. ఈ రెండు ఆలయాలు కొన్నేళ్ల క్రితం మూతపడ్డాయి. నిత్య పూజలు చేయకుండా, ధూప దీప నైవేద్యాలు పెట్టకుండా ఆలయాలను మూసి వేస్తే గ్రామానికి అరిష్టం తప్పదని వేద పండితులు హెచ్చరించారు. దీంతో, గ్రామస్తులంతా స్పందించారు. ఈ రెండు ఆలయాలను ఎలాగైనా పునఃప్రతిష్ఠించాలని నిర్ణయించారు. విషయాన్ని తమకు తెలిసిన వారికి వివరించారు. హైదరాబాద్‌కు చెందిన ఎన్ఆర్ఐలు ముందుకొచ్చారు. వీరిలో సీఎస్ఎస్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్ సీఈవో సాయి శ్రీనివాస్-సౌమ్య దంపతులు, ఎన్ఆర్ఐలు శ్రావ్య, డాక్టర్ కొండ ప్రదీప్ కుమార్, కె.రాకేష్,

ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

మందపూరి సాయిబాబు దంపతులు ఉన్నారు. వారి చొరవతో, యాదాద్రికి చెందిన వేద పండితులు శనివారం వచ్చి, ఈ రెండు ఆలయాలను పునఃప్రతిష్ఠించారు ఈ ఎన్ఆర్ఐలను ఆలయ కమిటీ సభ్యులు పట్టు శాలువాలతో సత్కరించారు.

'గీతాంజలి'కి ఎక్స్‌లెన్స్, పార్వతిరెడ్డికి ట్రైల్ బ్లేజర్ అవార్డు

అవార్డు అందుకుంటున్న కరస్పాండెంట్ టీవీ అప్పారావు

ఖమ్మం ఎడ్యుకేషన్, డిసెంబర్ 16: నగరంలోని శ్రీనివాసనగర్‌లోని గీతాంజలి పాఠశాలకు స్కూల్ ఎక్స్‌లెన్స్ అవార్డు లభించింది. ప్రతిష్ఠాత్మక బ్రెయిన్ ఫీడ్ ఎడ్యుకేషనల్ మ్యాగజీన్ ఈ అవార్డును అందజేసింది. హైదరాబాద్ హైటెక్స్‌లో శనివారం నిర్వహించిన జాతీయ విద్యా కార్యక్రమంలో ఈ అవార్డును కళాశాల కరస్పాండెంట్ టీవీ అప్పారావుకు నిర్వాహకులు అందజేశారు. గత 20 ఏళ్లుగా విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నందుకు గాను ఈ అవార్డును అందజేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రతిష్ఠాత్మకమైన అవార్డును సాధించిన టీవీ అప్పారావును పాఠశాల డైరెక్టర్లు టీ.పద్మ, టీ.అరుణ్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లితండ్రులు అభినందనలు తెలిపారు.

అవార్డు అందుకుంటున్న పార్వతీరెడ్డి

ఖమ్మం ఎడ్యుకేషన్, డిసెంబర్ 16: నగరంలోని హార్వెస్ట్ పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్.పార్వతిరెడ్డికి ట్రైల్ బ్లేజర్ అవార్డు లభించింది. జాతీయ విద్యా కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్ హైటెక్స్‌లో శనివారం జరిగిన కార్యక్రమంలో పార్వతిరెడ్డికి నిర్వాహకులు ఈ ట్రైల్ బ్లేజర్ అవార్డును అందజేశారు. దక్షిణ భారత దేశంలో 20 పాఠశాలలకు మాత్రమే ప్రకటించిన ఈ అవార్డు ఈ సంవత్సరం హార్వెస్ట్ పాఠశాల ప్రిన్సిపాల్‌కు దక్కింది. అవార్డును రావడం పట్ల హార్వెస్ట్ విద్యాసంస్థల కరస్పాండెంట్ పీ.రవి మారుత్, ఇన్‌చార్జులు ఉమామహేశ్వరరావు, శ్యామల నాగేశ్వరరావు, అరుణదీప్తి, స్ప్రింగ్ పాఠశాల ఇన్‌చార్జులు, టెండర్ రూట్స్ ఉపాధ్యాయులు పార్వతిరెడ్డికి అభినందనలు తెలిపారు.

'ఇసుక మాఫియా, ఓఎల్‌తో మాకు సంబంధం లేదు'

ఖమ్మం వ్యవసాయం, డిసెంబర్ 16: ఇసుక మాఫియా, ఓవర్ లోడింగ్‌తో నగర లారీ అసోసియేషన్‌కు ఏమాత్రం సంబంధం లేదని అసోసియేషన్ అధ్యక్షుడు భద్రం తెలిపారు. నగరంలోని లారీ యజమానుల సంఘం కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొద్ది రోజుల నుంచి ఇసుక అక్రమ తోలకాలు, ఓవర్ లోడింగ్‌తో లారీ యజమానులు ఇష్టారీతిన ప్రవర్తిస్తున్నారని వార్తలు రావడం బాధాకరమని అన్నారు. ఎవరో ఒకరిద్దరు ఇసుక అక్రమ తోలకాలు చేస్తే దానిని అసోసియేషన్‌కు ఆపాదించడం సరికాదని అన్నారు. అలాంటి లారీ యజమానులను సంబంధిత అధికారులు గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరారు. అక్రమార్కులను గుర్తించేందుకు తాము కూడా ఒక బృందాన్ని ఏర్పాటు చేస్తామని, ఒకవేళ తమకు అక్రమ వ్యవహారాలు తారసపడితే వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్తామని అ న్నారు. సమావేశంలో అసోసియేషన్ బాధ్యులు ఎం. రఘురాం, ఉమామహేశ్వరరావు, ఎస్‌కే రంజాన్, నకిరకంటి సత్యంబాబు, బోజెడ్ల పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ కోదండరామ్‌కు సత్కారం

జిల్లా పర్యటనకు వచ్చిన ప్రొఫెసర్ కోదండరాంను ఖమ్మం లారీ యజమానుల సంఘం నాయకులు కలిశారు. లారీ యజమానుల సంఘం బాధ్యుల విజ్ఞప్తి మేరకు శనివారం ఆయన అసోసియేషన్ కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాలతో సత్కరించారు.

పెండింగ్ వేతనాలు ఇవ్వాలి

కొత్తగూడెం అర్బన్, డిసెంబర్ 16 : శాసనసభ ఎన్నికల్లో విధులు నిర్వహించిన అంగన్‌వాడీ సిబ్బందికి వెంటనే వేతనాలు ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కంచర్ల జమలయ్య ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు శనివారం కొత్తగూడెం తహసీల్దార్ దొడ్డి పుల్లయ్యను కలిసి వినతిపత్రం అందజేసి సమస్యను వివరించారు. అసెంబ్లీ ఎన్నికల్లో బూత్ లెవెల్‌లో సుమారు రెండునెలలపాటు ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా పనిచేసిన వారికి వేతనాలు ఇవ్వాలని కోరారు.

సంగీత ప్రియులకు వీనుల విందు

రామదాసు కీర్తనలు ఆలపిస్తున్న శశిశ్రీ

భద్రాచలం, డిసెంబర్ 16: భద్రాచలం దివ్య క్షేత్రంలో నిర్వహిస్తున్న ముక్కోటి ఏకాదశి అధ్యయనోత్సవాల్లో భాగంగా శనివారం మిథిలా స్టేడియంలో సంగీత కార్యక్రమం.. సంగీత ప్రియులకు వీనుల విందు అందించింది. దేవస్థానం ఉపప్రధానార్చకులు కోటి రామస్వరూప్ సోదరి, మధిరలోని జిల్లాపరిషత్ పాఠశాల సంగీత ఉపాధ్యాయురాలు శశిశ్రీ ఆలపించిన రామదాసు కీర్తనలు.. వీక్షకులను పారవశ్యంలో ముంచెత్తాయి.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

బూర్గంపహాడ్, డిసెంబర్ 16: మండలంలోని ఉప్పుసాకలోగల కిన్నెరసాని వాగు నుంచి ఇసుక అక్రమంగా తోలుతున్న ట్రాక్టర్‌ను శనివారం తెల్లవారుజామున ఎస్సై నాగభిక్షం, కానిస్టేబుల్ గోపాల్ పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సారపాక, డిసెంబర్ 16: ఇసుక అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ తిరుమలాచారి ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఇసుక అక్రమ రవాణా సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు.

నేడు భద్రాద్రికి మంత్రి తుమ్మల

భద్రాచలం, డిసెంబర్ 16: రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదివారం భద్రాచలం రానున్నారు. ఉదయం 9.40 గంటలకు భద్రాచలంలో జరిగే ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొంటారు. 10.30 గంటలకు హైదరాబాద్ బయల్దేరతారు.

నేడు విశ్వబ్రాహ్మణుల వన భోజనాలు

మణుగూరు టౌన్, డిసెంబర్ 16: విశ్వబ్రాహ్మణ సంఘం వన భోజనాలు ఆదివారం మండలంలోని తోగ్గూడెం సమ్మక్క-సారలమ్మ ఆలయ సమీపంలో ఉంటాయని నాయకులు ఏఎం చారి, శంకరాచారి, నరసింహాచారి, వీరభద్రం, గంగాచారి, వారాది శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. విశ్వబ్రాహ్మణులంతా రావాలని కోరారు.